ప్రజావాణిలో ఫిర్యాదులు నిల్

సికింద్రాబాద్, జనవరి 29: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని జోనల్ కమిషనర్ రవికిరణ్ నిర్వహించారు.అలాగే సర్కిల్ కార్యాలయంలో డీసీ సుధాంష్ నిర్వహించారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి నిర్వహిస్తున్న ఈ ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు రాలేదని అధికారులు తెలిపారు.

14న ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

పనులు పరిశీలిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ జంపన ప్రతాప్

కంటోన్మెంట్, జనవరి 29 : బాపూజీ నగర్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఫిబ్రవరి 14న చేపడుతున్నామని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, ఆలయ కమిటీ చైర్మన్ జంపన ప్రతాప్, అధ్యక్షుడు దుర్గయ్యలు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాట్లను సికింద్రాబాద్ మహంకాళి ఆలయ ప్రధాన పూజారి వేణుమాధవ్ శర్మ, చంద్రశేఖర సిద్ధాంతితో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. వచ్చే నెల 12నుంచి ప్రతిష్ఠ పూజలు జరుగుతాయని, 14న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని తెలిపారు. దాతలు ఎవరైనా ఉంటే ఆలయ కమిటీ ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అజిత్ కల్యాణ్, సంతోష్, శ్రీకాంత్, రామారావు పాల్గొన్నారు.

త్వరలో.. ఈఎస్ఐ శ్మశానవాటిక అభివృద్ధి పనులు

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఈఎస్ఐ శ్మశానవాటిక అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, జనవరి 29 : 14 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈఎస్ఐ శ్మశానవాటిక అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం శ్మశానవాటికను జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ డిప్యూటీ కమిషనర్ జగన్, డిప్యూటీ ఈఈ మోహన్‌తో కలిసి ఎమ్మెల్యే సందర్శించి.. దీనిని రాష్ట్రంలోనే మోడల్‌గా శ్మశానవాటికగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. శ్మశానవాటిక అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు చాలా కాలం క్రితమే మంజూరైనా పనులు ఇంకా ఎందుకు ప్రారంభించలేదని ఆయన..అధికారులను ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన డిజైన్ ఫైనల్ చేయని కారణంగా పనులు ప్రారంభం కాలేదని అధికారులు వివరించారు. వెంటనే ఎమ్మెల్యే .. జీహెచ్ఎంసీ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి శ్మశానవాటిక అభివృద్ధి పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు.

మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులు కూడా..

పేదల ప్రయోజనార్థం సనత్‌నగర్ కైలాష్ నగర్‌లో మంజూరైన రూ. 3.3 కోట్ల నిధులతో చేపట్టాల్సిన నిర్మాణ పనుల్లో జాప్యం ఎందుకవుతోందని ఎమ్మెల్యే తలసాని అధికారులను ప్రశ్నించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు శుభకార్యాలు ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో చేసుకోవడం భారంగా మారుతున్న పరిస్థితుల్లో వారి అవసరాలు తీర్చేందుకు గతంలో రూ. 3.3 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల పనులు చేపట్టలేకపోయినట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలను పరిష్కరించి వీలైనంత త్వరగా అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఆయన జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. డివిజన్‌లోని సీ-టైపు క్వార్టర్స్ పార్కులో కొత్తగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను సందర్శించిన సందర్భంగా కాలనీ నివాసితులు కమ్యూనిటీహాల్‌లో ఎలక్ట్రికల్ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయని, వీటితో పాటు పార్కుకు గేటు, లోపల పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు ఇంకా ఏర్పాటు కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పార్కులోని కమ్యూనిటీ హాల్‌లోని ఎలక్ట్రికల్ పనులు, గేటు నిర్మాణం, పిల్లల ఆట పరికరాలు త్వరలో ఏర్పాటయ్యేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు.

అనంత రీహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభం

75 పడకలతో కూడిన వైద్యసేవలు.. పాల్గొన్న చినజీయర్‌స్వామి, ఇతర ప్రముఖులు

బేగంపేట్‌లోని అనంత రీహాబిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చినజీయర్ స్వామిజీ

సిటీబ్యూరో (నమస్తే తెలంగాణ) / బేగంపేట్ , జనవరి 29 : బేగంపేట్‌లోని అనంత రీహాబిలిటేషన్ సెంటర్‌ను చిన్న జీయర్ స్వామి ప్రారంభించారు. సోమవారం జరిగిన ప్రారంభోత్స వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 75 పడకలతో సకల సదుపాయాలతో ఏర్పాటు చేసిన రీహాబ్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. సమాజంలో అట్టడుగు వర్గాలకు వైద్య సేవలు అందించే దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు తప్పకుండా గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంత కో ఫౌండర్ డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రీహాబ్ థెరపీ అనేది అధునాతన చికిత్స విధానమని, తమ సెంటర్‌లో రీహాబిలిటేషన్, ట్రాన్సిషనల్ కేర్, నొప్పి నివారణ, పాలియేటివ్ కేర్, క్రిటికల్ కేర్, జనరల్ ఫిజిషియన్లు, ఇన్ఫెక్షన్లకు ప్రత్యేక చికిత్సలు చేస్తారని అన్నారు. కార్డియాలజీ, రెస్పిరేటరీ, స్పోర్ట్స్ మెడిసిన్, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్ విభాగాల్లో నిపుణులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ చైర్మన్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు, సన్‌షైన్ ఎండీ డా. గురువా రెడ్డి, డా. వేద ప్రకాష్, ఎంపీ టీజీ వెంకటేశ్, ఏఐజీ చైర్మన్ డా. నాగేశ్వర్ రెడ్డి, మైహోం గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వర్‌రావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే మర్రి

కంటోన్మెంట్, జనవరి 29 : నిరుపేదల ప్రజలకు ఉపయోగపడే సీఎంఆర్ఎఫ్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కంటోన్మెంట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యుడికి సుమారు రూ.1లక్ష విలువైన ఎల్వోసీని ఆయన అందజేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గం, ఐదో వార్డు మహాత్మ గాంధీనగర్‌కు చెందిన బేబీ అక్షర నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. దీనికి సంబంధించి వైద్య ఖర్చుల నిమిత్తం బీఆర్ఎస్ నేత పెద్దాల నర్సింహ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి విషయం చెప్పారు. దీంతో ఎమ్మెల్యే కృషితో రూ.1లక్ష ఎల్వోసీ మంజూరు కాగా.. బాధితురాలి తండ్రికి అందజేశారు.

బాధితురాలి తండ్రికి ఎల్వోసీని అందజేస్తున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్‌లోని చాచానెహ్రూనగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను సోమవారం పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమలత, జలమండలి మేనేజర్ సంధ్య, బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మీపతి, తదితరులు – బన్సీలాల్‌పేట్, జనవరి 29

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కంటోన్మెంట్, జనవరి 29 : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని నారాయణ విద్యాలయాల జనరల్ మేనేజర్ గోపాల్ రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని 7 నారాయణ పాఠశాలలకు సంబంధించిన ఇండియన్ మాస్టర్స్ ఒరిటర్ (వేదిక) పేరిట బోయిన్‌పల్లిలోని నారాయణ పాఠశాలలో సోమవారం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి గోపాల్ రెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాలు , స్పీచ్ , పాటలు , సంగీతం కార్యక్రమాలలో విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, భార్గవి, అడ్మినిస్ట్రేషన్ గంగాధర్, షఫీతో పాటు వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్‌లు అపరంజనీ, హేమలత, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

సమీక్షా సమావేశం..

సికింద్రాబాద్ పరిధిలోని నామాలగుండు బీఎన్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షా సమావేశానికి డిప్యూటీ సీఎం, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. రాష్ట్రంలో బీసీ జనగణనను చేపడుతామని తెలిపారు. అనంతరం నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్‌యాదవ్, అదం సంతోష్‌కుమార్, అదం ఉమాదేవి, అదం సృజన్‌కుమార్, నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్, బండి అభిషేక్‌ముదిరాజ్, దార్లపల్లి సాయి మధుకర్, సందీప్, బబ్లూ, చక్రధర్, మహ్మద్ వాహిదుద్దీన్ పాల్గొన్నారు. - సికింద్రాబాద్

'ఎక్స్‌లెన్స్ అవార్డ్స్' ప్రదానోత్సవం

బేగంపేట్, జనవరి 29: రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ 2023-24 సంవత్సరానికి ఒకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం బేగంపేట్‌లోని మనోహర్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ అధికారి ఏకే ఖాన్ హాజరయ్యారు. మమతా త్రివేది, వసుంధర రెడ్డి, మాధవి లత, గంగాధర్, డీవీ మనోహర్‌లు వోకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు వజ్రాల రాజగోపాల్, సెక్రటరీ సత్య పింజల పాల్గొన్నారు.



అవార్డ్స్ అందుకున్న సభ్యులు, ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిటైర్డ్ అధికారి ఏకే ఖాన్

'కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి'

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 29: ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఓయూ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణకు అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రతి ఏటా అందించే 15 శాతం వేతనం పెంపును ప్రస్తుతానికి పక్కన పెట్టారని గుర్తు చేశారు. దానిని పునరుద్ధరించాలని కోరారు. 11వ పీఆర్‌సీ అమలుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఓయూ ఉద్యోగ సంఘాల నాయకులకు సైతం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కట్టా వెంకటేశ్, సూర్యచందర్, వీరేశం, శ్రీనివాస్, యారాల రాజేశ్, అరుణ్, శ్రీకాంత్, రాము, సంతోష్, శివ, చేతన్, అబిద్, శేఖర్, జంగయ్య, అజయ్, శ్రీనివాస రెడ్డి, మల్లికార్జున్, ఫసియుద్దీన్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఓయూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘం నాయకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ డాక్టర్ ప్రమోద్ గుప్తా, ఎండీలు సురేశ్ , ప్రవీణ్ గుప్తా

కంటోన్మెంట్, జనవరి 29 : బోయిన్‌పల్లిలోని నోవా కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 250 మందికి పైగా రోగులు వచ్చి వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో రూ.6వేల విలువగల హైబ్రాస్కాన్, లివర్ సంబంధిత స్కాన్‌లతో పాటు పలురకాల స్కాన్‌లు ఉచితంగా చేశారు. అంతేకాకుండా జనరల్ మెడిసిన్, కంటి పరీక్షలు, గైనకాలజీ (గర్భాశయం), హృదయం, కాలేయం, సంబంధిత వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి రోగులకు మందులు అందజేశారు. ఈ శిబిరంలో నోవాకేర్ సీఈఓ డాక్టర్ ప్రమోద్ గుప్తా, ఎండీలు సురేశ్ , ప్రవీణ్ గుప్తా, డాక్టర్ హాసిని, డాక్టర్ సురేందర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలగిరి స్వర్గ వాటికలో అత్యాధునిక మార్చురీ ప్రారంభం

మార్చురీని ప్రారంభిస్తున్న ఎంసీఈఈ ఎంఈఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ సిధానా,ట్రస్ట్ నిర్వాహకులు

బొల్లారం,జనవరి 29: కంటోన్మెంట్ ఏడో వార్డు పరిధి, తిరుమలగిరిలోని స్వర్గ శ్మశాన వాటికలో అత్యాధునిక మార్చురీని సోమవారం ఎంసీఈఈ ఎంఈఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ సిధానా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఐపీఎస్ అధికారిణి తేజ్‌దీప్ కౌర్, స్వర్గ శ్మశానవాటిక ట్రస్ట్ వ్యవస్థాపకులు సురేందర్ పాల్‌సింగ్, ప్రధాన కార్యదర్శి రంజన్ సూద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు సురేందర్ పాల్ సింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం, స్వర్గవాటిక ట్రస్టు సంయుక్త సహకారంతో నడుస్తున్న ఈ శ్మశాన వాటికను పర్యావరణ అనుకూల శ్మశాన వాటికగా తీర్చిదిద్దామన్నారు. స్వర్గ వాటికలో నేత్రదానం కోసం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర దవాఖాన సహకారం అందిస్తున్నదని, అనాథ మృతదేహాలకు ఉచిత దహన సంస్కారాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు డి.ఎన్.గౌరి, శ్మశాన వాటిక సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ శతచండీ యాగ పూజలు

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో శ్రీ శతచండీ యాగ సహిత మహా కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా 3వ రోజు సోమవారం వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని యాగశాలలో కొలువుదీరిన అమ్మవారికి పూజలు నిర్వహించారు. అలాగే.. యాగశాల వద్ద గోమాత పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతున్న పూజల్లో ఈవో కుంట నాగరాజు, ఆలయ చైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్ పాల్గొన్నారు. – అమీర్‌పేట్

గద్దర్ విగ్రహావిష్కరణకు తరలిరండి..

గద్దర్ విగ్రహావిష్కరణ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 29 : ఈ నెల 31న సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని తెల్లాపూర్ మున్సిపాలిటీలో జరగనున్న ప్రజాయుద్ధనౌక గద్దర్ విగ్రహావిష్కరణకు విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఈ మేరకు విగ్రహావిష్కరణ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కుతాడి అర్జున్‌రావు, చీఫ్ వార్డెన్ డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గద్దర్‌కు ఓయూ మట్టితో చాలా అనుబంధం ఉందని అన్నారు. ఇక్కడి విద్యార్థులు, ప్రొఫెసర్లతో సైతం ఆయనకు సాన్నిహిత్యం ఉందని చెప్పారు. ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యను అభ్యసించి, తెలంగాణ ఉద్యమంలో ఇక్కడ జరిగిన అనేక సభలు, సమావేశాలకు హాజరై తన మాట, పాటలతో విద్యార్థులను చైతన్యం చేశారని గుర్తు చేశారు. గద్దర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో విద్యార్థులందరూ పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లష్కర్ ఫుట్‌పాత్‌లపై పెరుగుతున్న గొడవలు..!

- మద్యం మత్తులో హత్యలు ..
- దాడులకు తెగబడుతున్న ఉన్మాదులు

బేగంపేట్ జనవరి 29 : సికింద్రాబాద్ క్లాక్‌టవర్ సమీప ఫుట్‌పాత్‌లపై గొడవలు, కొట్లాటలు నిత్యకృత్యంగా మారాయి. వారం రోజుల్లో నలుగురిపై దాడులు, ఒక హత్య చోటు చేసుకున్నది. మద్యం మత్తులో డబ్బుల కోసం దాడులకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో గత సోమవారం 24న ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న నలుగురు మద్యం మత్తులో ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకొని గాయపడ్డారు. ఈ ఘటనలో పలువురిని గాయపర్చిన రాజు అనే వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. రాజు లాలాపేట్‌కు చెందిన నివాసి.. సికింద్రాబాద్ ఫుట్‌పాత్‌పైనే జీవనం సాగిస్తూ మద్యం మత్తులో గొడవలకు దిగుతున్నట్లు సమాచారం.

- ఇదే ప్రాంతంలో గుర్తు తెలియని ఉన్మాది మరో గుర్తు తెలియని వ్యక్తిని బ్లేడ్‌తో దాడి చేసి హత్య చేశాడు. ఈ హత్య అనంతరం మరో వ్యక్తిని తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన ఫుట్‌పాత్‌పై ఉండే మితిలేష్‌ను పోలీసులు విచారించగా.. దాడి చేసిన వ్యక్తి తనకు తెలియదని, నీళ్ల కోసం వెళ్తుంటే .. అతను వచ్చి డబ్బులు అడుగగా లేవని చెప్పానని.. దీంతో తనపై అకారణంగా బ్లేడ్‌తో దాడి చేసి పారిపోయాడని పోలీసులకు వివరించాడు. మితిలేష్‌పై దాడికి ముందు ఆదివారం అర్ధరాత్రి వైఎంసీఏ వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తిని బ్లేడ్‌తో గొంతుపై దాడిచేసి హత్య చేశాడు. ఈ హత్య చేసిన తర్వాతనే మితిలేష్ వద్దకు వచ్చి దాడి చేశాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

గతంలో ఇక్కడ నిత్యం గొడవలే..

గతంలో సికింద్రాబాద్ క్లాక్‌టవర్ ప్రాంతంలో నిత్యం ఇలాంటి ఘర్షణలే జరుగుతుండేవి. పోలీసులు గట్టి బందోబస్తుతో పాటు నేరాలు జరగకుండా చేశారు. తిరిగి కొద్ది రోజులుగా గతంలో మాదిరిగానే గుర్తు తెలియని వ్యక్తులు ఇక్కడికి వచ్చి గంజాయి, వైట్‌నర్ సేవించడంతో పాటు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో గొడవలు తిగిరి ప్రారంభం అయ్యాయని స్థానికులు వాపోతున్నారు. పోలీసులు గట్టి నిఘా పెట్టి ఫుట్‌పాత్‌లపై ఉండే నేరగాళ్ల పట్ల కఠనంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

డీక్లాస్‌లో మహ్మద్ ఆజమ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గ్యార్వీ ఉత్సవాల్లో బీఆర్ఎస్ నాయకులు కె.లక్ష్మీపతి, రుక్ముద్దీన్, జహంగీర్, రజాక్, ముకర్రమ్, అబ్బాస్, సమీ, సల్మాన్ - బన్సీలాల్‌పేట్, జనవరి 29

బోర్‌వెల్ పనులు ప్రారంభం

కంటోన్మెంట్ బోర్డు ఒకటో వార్డు, న్యూ బోయిన్‌పల్లి పెద్దతోకట్టలోని స్వర్ణ భారతి కాలనీలో సోమవారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి నూతన బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వార్డులోని ప్రతి బస్తీలో మంచినీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో దశన్, సదానంద్‌గౌడ్, మధు, శివకుమార్, సాయి యాదవ్, నంద, బాబు, మురళీ, తదితరులు పాల్గొన్నారు. - కంటోన్మెంట్, జనవరి 29

నేడు సీతాఫల్‌మండిలో క్యాన్సర్‌పై అవగాహన

సికింద్రాబాద్, జనవరి 29 : సీతాఫల్‌మండి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ హేమ అన్నారు. ఫెర్నినిస్ ఆసుపత్రి, సిపాథ్ ల్యాబ్ వారు క్యాన్సర్ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ శిబిరంలో క్యాన్సర్‌కు సంబంధించిన టెస్టులు ఉచితంగా నిర్వహిస్తార న్నారు. ఉచిత అవగాహన శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరం ఉదయం 10 నుంచి 12గంటల వరకు ఉంటుందన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, జనవరి 29:రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాగూడ గేట్ – మల్కాజిగిరి రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం గుర్తు తెలియని వ్యక్తి (50) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని.. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై నల్లటి రంగు చొక్కా, బ్లూ రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడని, సంబంధీకులు ఎవరైనా ఉంటే పీస్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.